# ఇంద్రధనుస్సు

ఈమధ్య సెడిక్ బర్మక్ అనే ఒక ఇరానీ నిర్మించిన ఒక పర్షియన్ సినిమా చూశాను. ఆఫ్ఘనిస్థాన్‌లో జరిగిన కథ ఇది. ఉన్మాదం పేరుతో మానవత్వం ఎలా మంటగలిసిపోయిందో మనసుల్ని కదిలించేలా తీసిన ఎంతో గొప్ప సినిమా. సినిమా పేరు ఒసామా. బిన్ లాడెన్ కథ కాదు కానీ, అతని తాలిబాన్ అక్రమాలతో బాగా సంబంధంవున్నదే. తాలిబాన్ అక్రమాల గురించి తీసిందే ఆ సినిమా చూస్తున్నంత సేపూ, తర్వాతా మనసంతా అదోలా అయిపోయింది. అసలు ఎందుకిలా జరుగుతున్నది? ఒక మనిషి జీవితం మీద ఇంకొక మనిషికి ఏమిటి హక్కు? వారి జీవితాలతో ఆడుకుని సాధిస్తున్నదేమిటి? ఈ విశేషాలు మీతో పంచుకోవాలని వ్రాస్తున్నానిది.

ఒక అమెరికన్ తెల్లమ్మాయి, తెల్లతను ఒక చిన్న కుర్రాడికి డబ్బు ఆశపెట్టి బురఖాలు వేసుకుని ఒక హాస్పిటల్లో నర్సులుగా మానవ సేవ చేస్తుంటారు. తెల్లతను కెమేరాతో అక్కడ జరిగే అత్యాచారాలు సినిమాలా తీస్తుంటాడు. తరవాత వాళ్ళని అంతగా చూడం మనం. కథలో పూర్తిగా మునిగిపోతాం.

అక్కడ తాలిబాన్ నిబంధనల ప్రకారం ఆడవారు ఉద్యోగాలు, ఏ నర్సు ఉద్యోగాలో తప్ప చేయకూడదు. అది మగవారి పని. అక్కడే ఒక బీద కుటుంబం. ఒక ఆవిడ, ఆవిడ కూతురు, అమ్మ. భర్త చనిపోయాడు. ఆవిడ తమ్ముడిని రష్యన్లు చంపేశారు. అంతకుముందు ఉద్యోగాలు చేసుకుని స్వశక్తితో మర్యాదగా బ్రతికిన వాళ్ళే. ఆవిడ అక్కడే హాస్పిటల్లో నర్సుగా పనిచేసేది. జీతాలు ఇవ్వకపోగా, తాలిబాన్ల అక్రమాలతో ఆ హాస్పిటల్ మూశేసి, ఉద్యోగస్తుల్నే కాక రోగులని కూడా బయటికి పంపించేశారు. ఉద్యోగం పోయాక అసలు రోజులు గడవటం లేదు. ఏం చేయాలో తెలియని పరిస్థితి. మగ సహాయం లేని ఆడవాళ్ళందరి పరిస్థితీ అంతే. ఆకలి బాధకి తాళలేక ఒక రోజు ఆడవాళ్ళంతా ఉద్యోగాలు కావాలని నినాదాలు చేసుకుంటూ వచ్చారు. తాలిబాన్లు ఆడవాళ్ళలా ఎదురు తిరగటం ఇష్టంలేక, కాల్పులతోనూ, పెద్ద గొట్టాలతో నీళ్ళు చల్లుతూనూ వాళ్ళ వెంబడిపడ్డారు. కొంతమందిని బలవంతంగా వానుల్లో ఎక్కించుకుని జైళ్ళకి తరలించారు. అది చూస్తూ నుంచున్న తల్లీ కూతుర్లని ఒక మిత్రుడు చివాట్లు పెట్టి క్షేమంగా ఇంటికి చేర్చాడు. ఆరోజు రాత్రి తిండి లేక పడుకున్నప్పుడు అమ్మమ్మ సలహా ఇచ్చింది. ఎనిమిదేళ్ళ వయసులో వున్న మనవరాలి జుట్టు కత్తిరించేసి అబ్బాయి అని చెప్పి ఏదన్నా చిన్న ఉద్యోగంలో చేర్పిస్తే వచ్చే కాస్తో కూస్తో సంపాదనతో మూడు పొట్టలూ నిండకపోతాయా అని.

కూతురు భయంగా అడుగుతుంది 'మరి తాలిబాన్లకి నేను అమ్మాయినని తెలిస్తే చంపేయరూ'. ఎప్పుడో ప్రాణం పోతుందన్న భయంకన్నా, ఈనాడు ఆకలితో పోతున్న ప్రాణాన్ని నిలుపుకోవటమవసరమని ఆ పిల్లకీ తెలుసు. అందుకే తల్లి తన జుట్టు కత్తిరించి, నాన్న వదిలేసిపోయిన బట్టల్ని చిన్నవి చేస్తున్నా మాట్లాడకుండా వూరుకుంది. అమ్మమ్మ చిన్న కథ చెబుతుంది. అమ్మాయిలబ్బాయిల్ని చూసి వాళ్ళు

కూడా అలాగే పెరిగి పెద్దయి ఉద్యోగాలు చేయాలనుకుంటారుట. అప్పుడు ఆకాశంలో ఇంద్రధనుస్సు క్రింద నుంచుంటే అమ్మాయిలు అబ్బాయిలయిపోతారుట. ఇంద్రధనుస్సు అంటే ఏమిటని అడుగుతుంది పిల్ల. ఇంద్రధనుస్సు అంటే దేవుడు అలా మారిపోదామనుకున్న పిల్లల కోసం ఆకాశంలో నిర్మించినదని చెబుతుంది.

తన భర్తతో కలిసి పద్నాలుగు ఏళ్ళు యుద్ధంలో పనిచేసిన ఒకతని దగ్గరికి తీసుకువెడుతుంది అబ్బాయిగా మారిన తన కూతురుని. అతను మిలటరీనించి రిటైరయాక చిన్న కాకా హోటల్ పెట్టుకుని బ్రతుకుతున్నాడు. అతను ఆమెని గుర్తు పట్టి నీ కూతురు ఎలా వుందని అడుగుతాడు. 'ఇదుగో ఈఅబ్బాయే నా కూతురు' అని చెప్పి తన కష్టసుఖాలు చెబుతుంది. అక్కడే ఏదన్నా ఉద్యోగం ఇచ్చి దయ చూపమంటుంది. నాకే గడవటంలేదు. ఇక నేనేం ఇవ్వగలను అంటాడు కానీ, అతని దయార్ద్ర హృదయం కరిగి 'అల్లా దయామయుడు. అంతా మంచే జరుగుతుంది' అని కొన్ని పాలు ఒక డబ్బాలో పోసి ఇచ్చి, మర్నాటినించే పనిలోకి రమ్మంటాడు.

మర్నాడు పనిలోకి వెళ్ళిన పిల్లకి అటు పాలు కాచటంలాటి పనులే కాక, జీవితపాఠాలుకూడా నేర్పుతాడు. ఆమె వేసుకున్న ఆడ చెప్పులు పారేసి వేరే చెప్పులు ఇస్తాడు. గొంతు మార్చి మగ గొంతుతో మాట్లాడాలని సూచిస్తాడు. మధ్యాన్నం నమాజుకి వెళ్ళే ముందు కాళ్ళు ఎలా కడుక్కోవాలి, నమాజు ఎలా చేయాలి అన్నీ నేర్పిస్తాడు. నమాజు దగ్గర అమ్మాయి తప్పు చేస్తుంటే చాల దీక్షగా ఆమెనే చూస్తుంటాడు ఒక తాలిబాన్. ఆరోజు పనవగానే పుచ్చకాయ, కొంత మాంసం ఇచ్చి ఆమెని ఇంటికి పంపిస్తాడు యజమాని. ఇంటికి వస్తున్నప్పుడు వెనకనే వస్తున్న తాలిబాన్ని చూసి భయపడి పరుగెత్తుకుంటూ ఇంటికి వస్తుంది. 'తాలిబాన్ నా వెంట పడ్డాడు' అని తల్లితో చెబుతుంది. తల్లి వెంటనే తలుపులన్నీ వేసేసి గొళ్ళాలు పెట్టేస్తుంది. కూతురి ఫొటోలన్నీ తగలబెట్టేస్తుంది. పుచ్చకాయ ముక్కలు తిన్నాక అమ్మమ్మ ఒళ్ళో పడుకుంటుంది పిల్ల. అమ్మాయి భయం తీర్చటంకోసం అమ్మమ్మ ఇంకో కథ చెబుతుంది. అనగనగా ఓ దంపతులకి ఒక అబ్బాయి, నలుగురు అమ్మాయిలు. అబ్బాయి కష్టపడి పనిచేసి ఇంటికి వస్తే, ఎగిరి గంతులు వేస్తూ ఆడుకుంటున్న చెల్లెళ్ళు కనపడతారు. ఆడపిల్లల్ని చూసి, నేనూ అలావుంటే బాగుంటుంది అనుకుంటాడు. అప్పుడు ఇంద్రధనుస్సు క్రిందకి వెళ్ళి ఆడపిల్లగా మారిపోతాడుట. అప్పుడు అమ్మమ్మే మళ్ళీ ఇంద్రధనుస్సు అంటే ఏమిటో చెబుతుంది. వాన వచ్చే ముందు గాలిలో తేమ వల్ల వస్తుంది అని!

మర్నాడు పనిలోవున్నప్పుడు వస్తాడు తాలిబాన్. నాతోరా, నీతో పనుంది అంటాడు. కాకా హోటల్ యజమాని, 'అతను అనాధ ఇక్కడే వుండనీ' అని వారిస్తాడు. అతను అమ్మాయిని తీసుకువెడతాడు. తాలిబాన్లు తన వయసు అబ్బాయిల్నే అందర్నీ తీసుకువెడుతుంటారు. 'బిన్‌లాడెన్ మనందరికీ యుద్ధం చేయుటం నేర్పిస్తాడుట' అంటాడు ఒక కుర్రాడు. 'మనల్ని తాలిబాన్లుగా మార్చేస్తాడుట' అంటాడు ఇంకొకడు. చివరికి వాళ్ళని తీసుకువెళ్ళింది ఒక ముల్లా దగ్గరికి. అక్కడ వాళ్ళందరికీ తలపాగాలు చుట్టి నమాజు చేయిస్తారు. తరువాత మిలటరీ కవాతు, పరుగెత్తించ

టాలూ. చెట్లు ఎక్కించటాలూ. మన ఎనిమిదేళ్ళపిల్ల కష్టపడుతూనే భయపడుతూనే ఇవన్నీ చేస్తుంటుంది. ముగ్గురు కుర్రాళ్ళు ఆమెని ఆట పట్టిస్తుంటారు ఆడపిల్లలా చేస్తున్నావని. అమ్మాయి ముఖంలా వుంది నీ ముఖం. చేతులు చూడు ఎంత లేతగా వున్నాయో అచ్చం అమ్మాయి చేతుల్లా అంటూ. కాదు నేను అబ్బాయినే అంటుంది. అయితే అబ్బాయిలా గబగబా ఈ చెట్టు ఎక్కు అని వెంటపడతారు. చివరికి ఇక భరించలేక చెట్టు ఎక్కటానికి ప్రయత్నిస్తుంది. భయపడుతూనే పైకి ఎక్కుతుంది కానీ, దిగటానికి ధైర్యం చాలదు. బలవంతాన అందరి సహాయంతోనూ దిగుతుంది. అబ్బాయి కాదనీ, అమ్మాయనీ అందరికీ తెలిసిపోతుంది. ఆ అమ్మాయి నడుముకి తాడు కట్టి లోతైన భావిలో మధ్యస్థంగా వేలాడదీస్తారు. భయంతో అరుస్తూ ఏడుస్తున్నా పట్టించుకోరు. తల్లిని దగ్గరికి రానివ్వరు. ఆ రాత్రి పిల్లని జైల్లో పెడతారు. అక్కడే మనం మళ్ళీ చూస్తాం, ముందు చెప్పుకున్న తెల్లబ్బాయినీ, తెల్లమ్మాయినీ.

మర్నాడు పంచాయితీ. ఊళ్ళోని జనం అంతా ఆరు బయట చేరతారు. ముల్లాగారు కూర్చుని పెద్ద ముల్లాగారి కోసం ఎదురు చూస్తుంటాడు. ఒక గాడిద బండిలో పెద్ద ముల్లా దిగుతాడు. ఆయన ముసలివాడు. ఎనభై ఏళ్ళపైనే వుంటుంది వయస్సు. చిన్న ముల్లా ఆయన చెవిలో అన్నీ వివరంగా చెబుతాడు. అంతా విన్నాక, ఇక తీర్పు చెప్పే సమయం. తెల్లతని విడియో కెమారాని తీసేసుకుంటాడు ముల్లా. అతను చేసింది నేరం కనుక అతన్ని కాల్చి చంపేయటం తగిన శిక్ష అని తీర్పు చెబుతాడు. అతన్ని అక్కడికక్కడే కాల్చిపారేస్తారు. తరువాత తెల్లమ్మాయి. అలా నర్సు పని చేసి సేవ చేయటం క్షమించరాని నేరం. అందుకని ఆమెని రాళ్ళతో కొట్టి చంపాలని ముల్లా తీర్పు. అక్కడే ఒక గుంట వుంది. ఆమెని ఒక గుడ్డలో చుట్టి తాడుతో కట్టేశారు. ఆమె తన్నుకుంటున్నది. అలాగే బలవంతాన గుంటలో పడేశారు. పక్కనే ఒక రాళ్ళ గుట్ట. తలా కాసిన రాళ్ళు తీసుకుని ఆమెని కొట్టటం ప్రారంభించారు. కొట్టు మిట్టాడుతున్న ఆమె కాళ్ళు చేతులు ఒక్కసారిగా ఆగిపోయాయి. ప్రాణం పోయింది.

ముల్లా తీర్పు చెప్పాడు. 'ఆడపిల్లగా పుట్టి మగవాడిలా ఉద్యోగం చేయటం, మగవాళ్ళతో పాటూ మసీదుకి వెళ్ళటం నేరం. చిన్న పిల్ల. అందుకని క్షమిస్తున్నాను. అయినా శిక్షవేయాలి తప్పదు' అన్నాడు. అందరూ ఏ శిక్ష వేస్తాడా అని ఆతృతగా ఎదురు చూస్తున్నారు. 'నన్ను పెళ్ళి చేసుకుని నాతో వచ్చేయటమే శిక్ష' అని లేచి నుంచున్నాడు. భోరుమని ఏడిచింది అమ్మాయి. చేయి పట్టుకుని బలవంతాన, ఆ పసిపిల్లని తనతో పాటూ గాడిద బండి ఎక్కించుకుని వెళ్ళిపోయాడు ముల్లా. ముల్లా ఇంట్లో తలుపు తీయగానే అక్కడలాటి వారు చాలమంది వున్నారు. వాళ్ళల్లో ఒకావిడ ఏడుస్తున్న మన ఎనిమిదేళ్ళ అమ్మాయి దగ్గరికి వచ్చి 'మేమూ నీలాటి వాళ్ళమే. పద స్నానం చేద్దువుగాని' అన్నది!

0 0 0

'నాలో క్షమించే గుణం వుంది, కానీ మరిచిపోయే గుణం లేదు' అంటాడు దక్షిణ ఆఫ్రికా నాయకుడు మండేలా.

0 0 0